రా మచ్చా మచ్చా..

రామ్‌చరణ్ తాజా చిత్రం 'గేమ్ చేంజర్' క్రిస్మస్ సందర్భంగా విడుదలకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. సినిమా విడుదలకు ఇంకా మూడు నెలల సమయం ఉన్నా.. పాన్ ఇండియా ఫిల్మ్ కాబట్టి ఇప్పటి నుంచే ప్రచారపర్వాన్ని వేగవంతం చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలిసింది. ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'జరగండి జరగండి' మంచి ఆదరణ దక్కించుకుంది. ఈ నేపథ్యంలో 'రా మచ్చా మచ్చా..' అంటూ సాగే రెండో పాట ప్రోమోను ఈ నెల 28న విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం పేర్కొంది. ఈ సందర్భంగా బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. తమన్ స్వరపరచిన చేసిన ఈ గీతాన్ని అనంత్ శ్రీరామ్ రచించారు. హుషారైన బీట్‌తో సాగే మాస్ పాట ఇదని చిత్ర బృందం పేర్కొంది. రాజకీయ, సామాజికాంశాలను చర్చిస్తూ తనదైన శైలి సందేశంతో దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కియారా అద్వాణీ, అంజలి, సముద్రఖని, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, దర్శకత్వం: శంకర్.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రోడ్

తన మధురగానంతో దశాబ్దాల పాటు సంగీతప్రియులను అలరించారు గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. అజరామరమైన గీతాలతో దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు. 2020 సెప్టెంబర్ 25న ఆయన స్వర్గస్తులయ్యారు. బుధవారం ఆయన నాలుగో వర్ధంతిని పురస్కరించుకొని తమిళనాడు ప్రభుత్వం అరుదైన గౌరవాన్ని ఇచ్చింది. చెన్నై నుంగంబాక్కంలోని కాందార్ నగర్ మెయిన్ రోడ్డుకు 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం' పేరు పెడుతున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆయన ఓ పోస్ట్ చేశారు. సీఎం స్టాలిన్ నిర్ణయంతో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మరపురాని మధుర ఘట్టం

సినీ తారలు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల గత నెలలో నిశ్చితార్థం జరుపుకున్న విషయం తెలిసిందే. ఇరు కుటుంబాలకు చెందిన సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో నిరాడంబరంగా వీరిద్దరి ఎంగేజ్‌మెంట్ జరిగింది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన నిశ్చితార్థ వేడుక గురించి శోభితా ధూళిపాళ్ల ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. తెలుగు సంప్రదాయాలకు అనుగుణంగా ఆ వేడుకను ఘనంగా నిర్వహించామని తెలిపింది. ఆమె మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరికి నిశ్చితార్థ వేడుక చాలా ప్రత్యేకమైనది. జీవితంలోని విలువైన క్షణాలవి. మన తెలుగు సంప్రదాయాలు ప్రతిబింబించేలా వేడుక చేసుకోవాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. నా కుటుంబం తెలుగు సంస్కృతికి ఎంతో విలువనిస్తుంది. వారి కోరిక మేరకు నా శ్రేయోభిలాషుల సమక్షంలో ఎంతో సంప్రదాయబద్ధంగా వేడుక జరగడం సంతోషాన్నిచ్చింది. ఇక ఎంగేజ్‌మెంట్ గురించి ముందస్తుగా ఎలాంటి ప్రణాళికలు వేసుకోలేదు. జీవితంలోని మధుర క్షణాలను ఆస్వాదించాలనే ఆలోచనలతో నా మనసు నిండిపోయింది. కొద్ది మందిని మాత్రమే ఆహ్వానించినా నా దృష్టిలో ఆ వేడుక ఘనంగా జరిగిందనుకుంటున్నా' అని చెప్పుకొచ్చింది. గత రెండేళ్లుగా ప్రేమలో ఉన్న చై–శోభితా ధూళిపాళ్ల త్వరలో పెళ్లిపీటలెక్కేందుకు సిద్ధమవుతున్నారు.

వేట్టయాన్..
ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'వేట్టయాన్–ది హంటర్'. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ రాజా దర్శకుడు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. దసరా సందర్భంగా అక్టోబర్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ప్రివ్యూ పేరుతో చిత్ర యూనిట్ ఓ వీడియోను విడుదల చేసింది. ఇందులో రజనీకాంత్‌ను పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోనే పేరుపొందిన ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా చూపించారు. 'మనకు ఎస్పీ పేరు మీద ఒక యముడొచ్చి దిగినాడు..' అంటూ నేరస్థులంతా వేట్టయాన్‌ను చూసి హడలిపోతుంటారు. అసాంఘిక శక్తుల ఆటకట్టించే పవర్‌ఫుల్ పోలీస్‌గా రజనీకాంత్ నటన ఆకట్టుకుంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా పేరు తెచ్చుకున్న వేట్టయాన్ జీవితంలో తెలియని కోణాలేమిటి? అతను ఏ లక్ష్యం కోసం బయలుదేరాడు? అనే అంశాలు ఆసక్తికరంగా ఉంటాయని చిత్ర బృందం పేర్కొంది. అమితాబ్ బచ్చన్, ఫహాద్ ఫాజిల్, రానా, రితికా సింగ్, దుషరా విజయన్, రోహిణి, అభిరామి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ మ్యూజిక్ అందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

కేరళలో నవ్వుల హంగామా



శర్వానంద్ హీరోగా 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఆద్యంతం హాస్యప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కేరళలో పదిరోజుల పాటు జరిగిన షెడ్యూల్‌లో కీలక సన్నివేశాల తెరకెక్కించారు. 'నాయకానాయికలు శర్వానంద్, సాక్షి వైద్యలపై ఓ పాటను చిత్రీకరించాం. అలాగే ఓ ఫైట్ సీక్వెన్స్‌ను కూడా తెరకెక్కించాం. ప్రేక్షకులకు వినోదాన్ని పంచడమే లక్ష్యంగా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను త్వరలో విడుదల చేస్తాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కథ: భాను భోగవరపు, నిర్మాతలు: అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రామ్ అబ్బరాజు.

అనూహ్య మలుపులతో 'క'

యువ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'క'. పీరియాడిక్ కథాంశంతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సుజీత్, సందీప్ దర్శకత్వం వహిస్తున్నారు శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకద్వయం సుజీత్, సందీప్ సోషల్‌మీడియా ద్వారా సినిమా విశేషాలను పంచుకున్నారు. తమ కెరీర్‌లో ఇదొక మెమొరబుల్ మూవీ అని పేర్కొన్నారు. 'గ్రామీణ నేపథ్యంలో జరిగే యాక్షన్ థ్రిల్లర్ ఇది. కథలోని మలుపులు ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తాయి. పీరియాడిక్ ఇతివృత్తంతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచే చిత్రమవుతుంది. ఈ చిత్ర మలయాళ థియేట్రికల్ హక్కులను అగ్ర హీరో దుల్కర్ సల్మాన్ సొంతం చేసుకున్నారు' అని తెలిపారు. నయన్‌సారిక, తన్వీరామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విశ్వాస్ డానియేల్, సంగీతం: సామ్ సీఎస్, దర్శకత్వం: సుజీత్, సందీప్.

జీవితమనే శత్రువుని గెలవాలి

యువ హీరోలు ప్రిన్స్, ఆగస్త్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కలి'. శివ శేషు దర్శకుడు. రుద్ర క్రియేషన్స్ పతాకంపై లీలా గౌతమ్ వర్మ నిర్మిస్తున్నారు. సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబర్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ఈ సినిమా ట్రైలర్‌ను 'హనుమాన్' ఫేమ్ దర్శకుడు ప్రశాంత్‌వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..ట్రైలర్ చాలా థ్రిల్లింగ్ ఉందని, గ్రిప్పింగ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా అనిపిస్తున్నదని అన్నారు. కుటుంబ కష్టాలతో శివరామ్ అనే యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నిస్తాడు. అదే సమయంలో ఓ అపరిచిత వ్యక్తి అతని ఇంటికి వస్తాడు. ఆ తర్వాత ఏం జరిగిందనే అంశాలతో ట్రైలర్ ఉత్కంఠను పంచింది. 'మనిషి పుట్టడంతోనే జీవితం అనే శత్రువుని వెంటేసుకొని మరీ పుడతాడు. దాని మీద గెలిచినోడే గొప్పోడవుతాడు. ఓడినోడు మధ్యలోనే..' అంటూ ప్రియదర్శి అందించిన వాయిస్ ఓవర్ కథలోని సోల్‌ని తెలియజెపుతున్నది. ఈ చిత్రానికి కెమెరా: నిషాంత్ కటారి, రమణ జాగర్లమూడి, సంగీతం: జీవన్‌బాబు, సమర్పణ: కె.రాఘవేంద్రరెడ్డి, రచన–దర్శకత్వం: శివ శేషు.

రైతులకు క్షమాపణ

రైతు సాగు చట్టాల అమలు గురించి సినీ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ప్రతిపక్ష పార్టీలన్నీ కంగనా రనౌత్ తీరుని తప్పుబట్టాయి. ఆమె వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని రైతులకు క్షమాపణలు చెబుతున్నట్లు కంగనా రనౌత్ బుధవారం ఎక్స్ (ట్విట్టర్) ద్వారా తెలిపింది. 'నేను బీజేపీ కార్యకర్తను. నా మాటలను పార్టీకి సంబంధించిన స్టాండ్‌గానే చూడాలి. నా వ్యక్తిగత అభిప్రాయంగా పరిగణించవొద్దు. ఒకవేళ నా మాటలు మిమ్మల్ని బాధపెట్టి ఉంటే క్షమాపణ కోరుతున్నా. నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా' అని ట్విట్టర్‌లో విడుదల చేసిన వీడియోలో కంగనా రనౌత్ పేర్కొంది. కొద్ది రోజుల క్రితం హిమాచల్‌ప్రదేశ్‌లోని సొంత నియోజకవర్గం మండీలో జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్న కంగనా రనౌత్ సాగు చట్టాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే సాగు చట్టాలపై వ్యతిరేకత వస్తున్నది కాబట్టి వాటిని అమలు చేసే విషయంలో కేంద్రం పునరాలోచన చేయాలని కోరింది. ఆమె వ్యాఖ్యలపై అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో తాజాగా వాటిని వెనక్కి తీసుకుంటున్నట్లు కంగనా రనౌత్ ట్విట్టర్ ద్వారా తెలిపింది.

ఒక్కరాత్రి జరిగే కథ

కార్తీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన 'సత్యం సుందరం' చిత్రం ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకరానుంది. '96' ఫేమ్ ప్రేమ్‌కుమార్ దర్శకత్వం వహించారు. సూర్య, జ్యోతిక నిర్మాతలు. తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా దర్శకుడు ప్రేమ్‌కుమార్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇదొక అందమైన ఫ్యామిలీ డ్రామా. ఒక్క రాత్రిలో కథ జరుగుతుంది. కార్తీ, అరవింద్ స్వామి మధ్య ఉన్న అనుబంధం ఏమిటి? వారి మధ్య ఎలాంటి మానసిక సంఘర్షణ చోటుచేసుకుంది అనే అంశాలు ఆసక్తికరంగా అనిపిస్తాయి' అన్నారు. ఈ కథను తొలుత నవలగా రాశానని, ఆ తర్వాత సినిమా ఫార్మాట్‌లో స్క్రిప్ట్‌గా తీర్చిదిద్దానని ప్రేమ్‌కుమార్ తెలిపారు. 'కార్తీ, అరవింద్ స్వామి నవలను చదివారు. వారికి ఎంతగానో నచ్చింది. ఆ తర్వాత స్క్రిప్ట్ విని కూడా హ్యాపీగా ఫీలయ్యారు. ఇద్దరూ అద్భుతమైన పర్‌ఫార్మెన్స్ కనబరిచారు. గోవింద వసంత మ్యూజిక్ సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తుంది. సినిమాటోగ్రఫీ, విజువల్స్ మరో స్థాయిలో ఉంటాయి. తెలుగు వెర్షన్ డబ్బింగ్ బాగా వచ్చింది. స్ట్రెయిట్ తెలుగు సినిమా చూస్తున్న అనుభూతినిస్తుంది' అన్నారు.